శుక్రవారం 06-09-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 448 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



## విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ సిద్ధం

- నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ
- గ్లోబల్ ఏఐ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

ముందడుగు హైదరాబాద్:
నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ అని సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. "కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయి. అవి ఆశలతో పాటు భయాన్నీ తీసుకొస్తాయి.

విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశాం. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం"అని అన్నారు.

### దేశంలో కొత్త నేర చట్టాల కింద

## తొలి శిక్ష

### 48 రోజుల్లోనే ఇద్దరికి జీవితఖైదు

### భారత న్యాయవ్యవస్థలో నూతన అధ్యాయం



ముందడుగు జాతీయం:
భారత ప్రభుత్వం న్యాయవ్యవస్థలో నూతన చట్టాలను తీసుకొచ్చారు. ఈ ఏడాది జులై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్ఏ) అమల్లోకి వచ్చాయి. ఈ కొత్త నేర చట్టాల కింద తాజాగా తొలి శిక్ష పడింది. ఓ హత్య కేసుకు సంబంధించి బిహార్‌లో ఇద్దరికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఘటన జరిగిన 48 రోజుల్లోనే వారికి దోషులుగా తేల్చి శిక్ష ఖరారు చేయడం గమనార్హం. బిహార్‌లోని శరణ్ జిల్లాలో జులై 17న మూక హత్యలు జరిగాయి. ధనాదిహ్ గ్రామానికి మిగతా 2లో



అత్యాచారం జరిగిన స్థలంలో మరమ్మత్తు పనులు

మిగతా 2లో



తల్లిదండ్రుల భుజాలపై పిల్లల శవాలు

మిగతా 2లో




మహిళ పట్ల అంబులెన్స్ డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

మిగతా 3లో





మహిళ పట్ల అంబులెన్స్ డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

మిగతా 4లో

### ఈవీ తయారీలకు రాయితీలు

## అవసరం లేదు

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ




ముందడుగు జాతీయం:
దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి ఖర్చులు భారీగా ఉండేవని, అయితే.. ప్రస్తుతం డిమాండ్ పెరిగిన దృష్ట్యా ఇవి తగ్గాయని, దీంతో సబ్సిడీలు అనవసరమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బీఎన్ఈఎఫ్ సమావేశంలో పాల్గొన్న గడ్కరీ ఈమేరకు వ్యాఖ్యానించారు. వినియోగదారులు ఇప్పుడు ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలను సొంతంగా ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దగా మిగతా 2లో

## భారత్ శాంతి కోరుకునే దేశం

### శాంతిని కాపాడాలంటే యుద్ధానికి సిద్ధంగా ఉండాలి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



ముందడుగు జాతీయం:
దేశంలో శాంతిని కాపాడాలంటే భారత సైన్యం యుద్ధానికి సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. లఖ్‌నవూలో ఏర్పాటు చేసిన త్రివిధ దళాల కమాండర్ల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఆయన రష్యా-ఉక్రెయిన్, గాజా సంక్షోభాలతోపాటు బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులను విశ్లేషించాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేసుకోవడంతోపాటు ఊహించని పరిణామాలను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మిగతా 2లో

ముందడుగు
శుక్రవారం, 06-09-2024, హైదరాబాద్

## అత్యాచారం జరిగిన స్థలంలో
# మరమ్మత్తు పనులు

## బయటపడుతున్న ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ఆగడాలు

### మరింత సమాచారం సేకరిస్తున్న సిబిఐ

ముందడుగు పశ్చిమబెంగాల్: పశ్చిమబెంగాల్ కోల్‌కతా వైద్యురాలి అత్యాచార ఘటన దేశాన్ని కుదిపేసింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ వైపే చూపించాయి. వైద్యురాలి హత్యాచార ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం బెంగాల్ ప్రభుత్వం మరొక కాలేజీలో అదే పోస్టు ఇచ్చింది. ఈ వ్యవహారం సంచలనం సృష్టించడంతో హైకోర్టు అతన్ని తప్పించింది. ఈ కేసును హైకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించింది.



సందీప్ ఘోష్‌కు సంబంధించిన అగడాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వైద్యురాలి హత్యాచార ఘటన జరిగిన తర్వాతే.. సంఘటనాస్థలిలో మరమ్మత్తు పనులు చేయించినట్లుగా తెలుస్తోంది. సందీప్ ఘోష్ ఆదేశాలతో మరమ్మత్తులు జరిగినట్లుగా విచారణలో వెలుగులోకి వస్తున్నాయి. హాస్పిటల్‌లోని డ్యూటీ డాక్టర్ల గదుల మరమ్మతులు మరియు పునరుద్ధరణ కోసం పిడబ్ల్యూడికి సందీప్ ఘోష్ రాసిన లేఖ వెలుగులోకి వచ్చింది. ఆగస్టు 9న వైద్యురాలు హత్యాచారానికి గురైతే.. ఆస్పత్రిలో పనులు పునరుద్ధరించాలని కోరుతూ సందీప్ ఘోష్ ఆగస్టు 10న పీడబ్ల్యూడీకి లేఖ రాశారు.

ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో ఆన్-డ్యూటీ వైద్యుల గదులు, ప్రత్యేక అటాచ్డ్ టాయిలెట్‌ల కొరత ఉందని మీకు తెలియజేస్తున్నాను. హాస్పిటల్‌లోని రెసిడెంట్ వైద్యుల డిమాండ్ మేరకు వెంటనే అవసరమైన వాటిని చేయవలసిందిగా లేఖ ద్వారా అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. వైద్యురాలి హత్యాచారం జరిగిన తర్వాతే ఈ విధంగా మరమ్మత్తులు చేయించడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. న్యాయస్థానం కూడా తీవ్రంగా తప్పపట్టింది. అయితే ఘటన తర్వాతే ఆస్పత్రిలో మరమ్మత్తు పనులు ఎందుకు చేయించాల్సి వచ్చింది? అన్నదానిపై సీబీఐ కూపీలాగుతుంది.

## దేశంలో కొత్త నేర చట్టాల కింద తొలిశిక్ష

(మొదటిపేజీ తరువాయి)
చెందిన తారకేశ్వర్ సింగ్ కుటుంబంపై దుండగులు దాడి చేశారు. డాబాపై నిద్రిస్తున్న వారిని విచక్షణా రహితంగా పొడిచారు. ఈ ఘటనలో తారకేశ్వర్, ఆయన ఇద్దరు కుమార్తెలు ప్రాణాలు కోల్పోగా.. భార్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే దాడికి పాల్పడిన సుధాన్షు కుమార్, అంకిత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన 14 రోజుల్లోనే వీరిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం వీరిద్దరినీ దోషులుగా తేలుస్తూ తీర్పు వెలువరించింది. గురువారం వీరికి జీవిత ఖైదు విధిస్తూ సెషన్స్ కోర్టు శిక్ష ఖరారు చేసింది. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ.. కొత్త నేర చట్టాల కింద దేశంలో తొలి శిక్ష ఇదేనని తెలిపారు.

## ఈవీ తయారీలకు రాయితీలు
# అవసరం లేదు

(మొదటిపేజీ తరువాయి)
సబ్సిడీలు ఇవ్వాల్సిన అవసరం లేదు. పైగా.. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఈవీలపై జీఎస్టీ తక్కువగా ఉంది. కాబట్టి.. ఇకపై ఈవీల తయారీదారులు ప్రభుత్వ రాయితీలు కోరడం సమంజసం కాదు" అని పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలోపు పెట్రోల్, డీజిల్ వాహనాలు, ఈవీల ధర ఒకే విధంగా ఉంటుందన్నారు. విద్యుత్, హైబ్రిడ్ వాహనాల తయారీ, వాడకాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన ఫేమ్ పథకం మూడో దశను మరో రెండు నెలల్లో ఖరారు అవకాశం ఉందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఈ పథకానికి సంబంధించి వచ్చిన ప్రతిపాదనలపై అధికారులు కసరత్తు చేస్తున్నారని, ఫేమ్ మొదటి రెండు దశల్లో ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు యత్నిస్తున్నారని చెప్పారు.

## భారత్ శాంతి కోరుకునే దేశం

(మొదటిపేజీ తరువాయి)
భారత్ శాంతి కోరుకునే దేశమని, దీన్ని కాపాడుకోవాలంటే సాయుధ బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాలన్నారు. వాస్తవాధీన రేఖ వెంట నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులను ప్రస్తావించిన ఆయన.. శాంతి, స్థిరత్వానికి ఉత్తర సరిహద్దు, పొరుగుదేశాల్లో నెలకొన్న పరిస్థితులు సవాల్ విసురుతున్నాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సైన్యాధికారులు విస్తృత, లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# తల్లిదండ్రుల భుజాలపై పిల్లల శవాలు

## అంబులెన్స్ లేకపోవడంతో 15 కిలోమీటర్లు మోసుకెళ్లారు

### మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో దారుణ సంఘటన

ముందడుగు మహారాష్ట్ర: అనారోగ్యం బారిన పడి ఇద్దరు బాలురు చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో పిల్లల మృతదేహాలను తల్లిదండ్రులు తమ భుజాలపై గ్రామం వరకు మోశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పట్టిగావ్‌కు చెందిన దంపతుల పదేళ్ల లోపు వయస్సున్న ఇద్దరు కుమారులు తీవ్ర జ్వరం బారినపడ్డారు. సకాలంలో వైద్యం అందక చికిత్స పొందుతూ ఆసుపత్రిలో గురువారం మరణించారు. చనిపోయిన పిల్లల మృతదేహాలను తమ గ్రామానికి



తరలించేందుకు ఆ ఆసుపత్రిలో అంబులెన్స్ సదుపాయం లేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ భుజాలపై కుమారుల మృతదేహాలను మోశారు. వర్షంలో తడిసిన బురద మార్గంలో సుమారు 15 కిలోమీటర్లు నడిచి తమ గ్రామానికి చేరుకున్నారు. మరోవైపు మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ ఈ విషాదానికి సంబంధించిన వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సీఎం ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో ఎన్సీపీకి చెందిన ధర్మారావు బాబా అత్రమ్ ఎఫ్‌డీఏ మంత్రిగాను, బీజేపీకి చెందిన డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ గడ్చిరోలి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్నారని తెలిపారు. సెప్టెంబరు 1న గర్భిణీ గిరిజన మహిళ ఇంటి వద్ద చనిపోయిన బిడ్డను ప్రసవించిందని, ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి అంబులెన్స్ పంపడంలో విఫలమవడంతో ఆమె మరణించిందని విజయ్ వాడెట్టివార్ గుర్తుచేశారు. తాజాగా ఇద్దరు పిల్లలు జ్వరంతో చనిపోవడం ఈ నెలలో రెండో సంఘటన అని పేర్కొన్నారు.

## శివాజీ విగ్రహం కూలిన ఘటనలో శిల్పి అరెస్ట్

### పోలీసులకు పట్టిచ్చిన భార్య






ముందడుగు మహారాష్ట్ర: మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి జైదీప్ ఆప్టేని పోలీసులు అరెస్టు చేశారు. అతని భార్య ఇచ్చిన సమాచారంతో అదుపులోకి తీసుకున్నారు. సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్‌కోట్ కోటలో ఏర్పాటు చేసిన 35 అడుగుల శివాజీ విగ్రహం ఆగస్టు 26న కుప్పకూలిన విషయం తెలిసిందే. దీంతో శిల్పి సహా పలువురిపై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో తనని అరెస్ట్ చేస్తారనే భయంతో జయదీప్ పరారయ్యాడు. అతని కోసం పోలీసులు ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. అయితే కల్యాణ్‌లోని అతని ఇంటి బయట అదుపులోకి తీసుకున్నారు. కుటుంబాన్ని కలిసేందుకు వస్తున్నాడని ఆప్టే భార్య పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అరెస్టు చేశారు.

ముందడుగు
శుక్రవారం, 06-09-2024, హైదరాబాద్



## హిందూ మతంలోకి మారిన ముస్లిం మహిళ

### తన కుమారులకు లవ్‌కుష్ అని నామకరణం

ముందడుగు మధ్యప్రదేశ్:
భర్త వేధింపులు తట్టుకోలేక ఓ ముస్లిం మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి హిందూ మతంలోకి మారింది. హిందూ మతంపై తనకున్న అచంచల విశ్వాసాన్ని తెలుపుతూ ఆ మహిళ తన కుమారులకు లవ్-కుష్ అని పేరు పెట్టింది. తన పేరును మెహనాజ్ బికి బదులుగా మీనాక్షిగా మార్చుకుంది. సనాతన సంప్రదాయంలో మహిళలకు ఉన్న గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని తాను హిందూమతంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పింది.

మధ్యప్రదేశ్ ధమ్నార్ గ్రామంలో నివసిస్తున్న మెహనాజ్ (30), 12 మరియు 11 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు కుమారులతో కలిసి బుధవారం మందసౌర్‌లోని గాయత్రి ఆలయంలో హిందూ మతంలోకి మారింది. సుమారు గంటన్నరపాటు మంత్రాలు పఠించిన తర్వాత తమ కొడుకలకు నామకరణం చేశారు. అనంతరం.. మెహనాజ్ మాట్లాడుతూ, సనాతన ధర్మంలో మహిళలకు గౌరవం ఉందని యూట్యూబ్‌లో, ఇతర ప్రాంతాల్లో చూసేదానినని చెప్పింది. కుటుంబంలో వారికి గౌరవం ఉంటుంది. ఈ క్రమంలోనే.. హిందూ సంస్థకు చెందిన వారిని సంప్రదించి సనాతన ధర్మాన్ని స్వీకరించినట్లు మెహనాజ్ బీ(మీనాక్షి) చెప్పకొచ్చింది. మెహనాజ్ బీకి 15 సంవత్సరాల క్రితం ధన్మార్‌కు చెందిన ఇర్ఫాన్ ఖాన్‌తో వివాహం జరిగింది. మొదట్లో అంతా బాగానే ఉన్నా ఆ తర్వాత భర్తతో పాటు అత్తమామల ప్రవర్తనలో కూడా మార్పు వచ్చిందని తెలిపింది. చిన్న చిన్న విషయాలకే గొడవలు మొదలయ్యాయని.. ఏ చిన్న సమస్య వచ్చినా తిడుతూ కొట్టేవాడని పేర్కొంది. ఈ విషయం తన నాన్నకు చెప్పగా, ఇది మీ కుటుంబ విషయం అని అన్నాడని చెప్పింది.

## మహిళ పట్ల అంబులెన్స్ డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

### ప్రతిఘటించడంతో భర్త ఆక్సిజన్ సపోర్ట్ తీసేశారు

ముందడుగు ఉత్తరప్రదేశ్:
ఒక మహిళ అనారోగ్యంతో ఉన్న తన భర్తను అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా ఆ మహిళ పట్ల డ్రైవర్, మరో వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆమెను లైంగికంగా వేధించారు. ఆ మహిళ ప్రతిఘటించడంతో ఆమె భర్తకు ఆక్సిజన్ సపోర్ట్ తీసేశారు. భర్తతోపాటు ఆ మహిళను అంబులెన్స్ నుంచి బయటకు తోసేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆగస్ట్ 30న అనారోగ్యంతో ఉన్న భర్త హరీష్‌ను సమీపంలోని బస్తీ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు అతడి భార్య తీసుకెళ్లింది. ఆ వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో మరో ఆసుపత్రికి తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు.
ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లే స్థోమత లేకపోవడంతో ఆ మహిళ తన భర్తను అంబులెన్స్‌లో ఇంటికి తీసుకెళ్లసాగింది. ఈ సందర్భంగా ఆమెను ముందు సీటులో కూర్చోవాలని డ్రైవర్ బలవంతం చేశాడు.




అతడితోపాటు మరో వ్యక్తి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆ మహిళ ప్రతిఘటించడంతో అంబులెన్స్‌ను నిలిపివేశారు. ఆమె భర్తకు ఆక్సిజన్ సపోర్ట్ తీసేశారు. వారిద్దరిని అంబులెన్స్ నుంచి బయటకు తోసేశారు. దీంతో గాయపడిన ఆమె భర్త ఆరోగ్యం మరింతగా క్షీణించింది. మరోవైపు ఆ మహిళ తన సోదరుడికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పింది. అతడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు గాయపడిన మహిళ భర్తను గోరఖ్‌పూర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మరణించాడు. అనంతరం బాధిత మహిళ అంబులెన్స్ డ్రైవర్, సహాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 92 కోట్లు పన్ను చెల్లించిన షారుక్ ఖాన్

### రెండో స్థానంలో తమిళ హీరో విజయ్ 80 కోట్లు

ముందడుగు జాతీయం:
దేశంలో స్టార్ సెలబ్రిటీల సంపాదన కోట్లల్లో ఉంటుంది.. సినిమాలతో పాటు క్రీడలు, పరిశ్రమల్లోని తమ తమ రంగాల్లో రాణిస్తూ వేల కోట్లు సంపాదించే హీరో, హిరోయిన్లు ఉన్నారు. వాటితో పాటు ఇతర బిజినెస్‌ల రూపంలోనూ భారీగానే సంపాదిస్తుంటారు. సంపాదనలో నువ్వా, నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. అదే సమయంలో ట్యాక్స్ పే విషయంలోనూ మన సెలబ్రిటీలు ముందున్నారు. ఏడాదికి ఏకంగా రూ.కోట్ల రూపంలో ట్యాక్స్ చెల్లిస్తున్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అత్యధికంగా ట్యాక్స్ కట్టిన స్టార్స్ లిస్ట్‌ను ఫార్చ్యూన్ ఇండియా తాజాగా వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. భారతీయ సెలబ్రిటీలందరిలో బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ అత్యధికంగా పన్ను చెల్లించారు. ఏకంగా రూ.92 కోట్లతో ఆయన తొలి స్థానంలో నిలిచారు. ఆ



తర్వాత స్థానంలో కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ ఉన్నారు.

ఆయన ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.80 కోట్లు పన్ను రూపంలో చెల్లించారు. ఇక రూ.75 కోట్లతో సల్మాన్ ఖాన్ మూడో స్థానంలో, రూ.71 కోట్లతో బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ నాలుగో స్థానంలో నిలిచారు. ఇక టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ రూ.66 కోట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

## కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

### ఈ ఏడాది 13కు చేరిన మరణాలు

ముందడుగు:
రాజస్థాన్ కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. చదువుల ఒత్తిడిలో చితికిపోతున్న పలువురు విద్యార్థులు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 13 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని మరణించారు. ఇక గతేడాది ఏకంగా 30 మంది విద్యార్థులు ఇక్కడ సూసైడ్ చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్ మథురలోని బర్సానాకు చెందిన పరశురామ్ (21) నీట్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు వారం రోజుల క్రితం రాజస్థాన్‌లోని కోటాకు వచ్చాడు. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని కోచింగ్ క్లాసులకు హాజరవుతున్నాడు. అయితే, కొన్ని గంటల పాటు పరశురామ్ కనిపించకపోవడంతో ఇంటి యజమాని అనూప్ కుమార్ పోలీసులకు సమాచారం అందించాడు. బుధవారం సాయంత్రం సమయంలో పరశురామ్‌ను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత నుంచి అతను కనిపించడం లేదంటూ అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో పోలీసులకు ఫోన్ చేసి యజమాని అనూప్ తెలిపాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పరశురాం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు పరశురాం గది తలుపులు పగలగొట్టి చూడగా.. ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు.

ముందడుగు
శుక్రవారం, 06-09-2024, హైదరాబాద్

# అంగన్వాడీ ఉపాధ్యాయులకు సన్మానం

## స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



ముందడుగు హైదరాబాద్:
చిన్నారులకు ఊహ తెలిసి తెలియని వయస్సులోనే వాళ్లకు ఆటపాటలు నేర్పిస్తూ, వాళ్ళ సంరక్షణను అనుక్షణం పరిరక్షిస్తున్న అంగన్వాడీ ఉపాధ్యాయులకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి, మెమోటోలు, ప్రశంస పత్రాలను అందించారు. మా సేవలను ఏ ప్రభుత్వం కూడా గుర్తించలేదు సరైన గుర్తింపు రాలేదు. మొట్టమొదటిసారిగా అంగన్వాడీ ఉపాధ్యాయులు కూడా ఉపాధ్యాయులే అని స్కై ఫౌండేషన్ గుర్తించి సన్మానం చేయడం మాకు మధురమైన అనుభూతిని మిగిలించింది అని తెలుపుతూ స్కై ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు దణ్ణమ్మా, నర్సవ్వ, ధనలక్ష్మి, బాలసరస్వతి, అంజనకుమారి, ప్రమీల, ప్రతిభ, మంజులత, సావిత్రి, విజయరాణి, రుత్త, జీవనేశ్వరి, సరితా, అనురాధ, ఈశ్వరమ్మ, వి. రమ, శీలాబాయి, నాగమణి, అంజమ్మ, ఎం. అనిత ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సేవ సభ్యులు ఇఫ్రాన్, అఖిల్ పాల్గొన్నారు.

# ఆమె అడుగుపెడితే బంగారు పతకమే

## పారాలింపిక్స్‌లోనే సాధించిన 18 స్వర్ణాలు!

ముందడుగు జాతీయం:
బ్రిటన్‌కు చెందిన పారాలింపియన్ సారా స్టోరే రెండున్నర దశాబ్దాల్లో విశ్వక్రీడల్లో మొత్తంగా 18 స్వర్ణాలతోపాటు అనేక రజత, కాంస్య పతకాలు సాధించి రికార్డుల మోత మోగిస్తోంది. సారా స్టోరేకు పుట్టుకతోనే ఎడమ చేతికి వైకల్యం ఉంది. అయినప్పటికీ స్విమ్మింగ్ పట్ల మక్కువ చూపిన ఆమె.. 14 ఏళ్ల ప్రాయంలోనే పారాలింపిక్ పోటీల్లో పాల్గొని తొలిసారి పతకం సాధించింది. 1992 నుంచి 2004 వరకు జరిగిన నాలుగు పోటీల్లో పాల్గొని మొత్తం ఐదు బంగారు, ఎనిమిది రజతాలు, మూడు కాంస్య పతకాలు సొంతం చేసుకుంది.




### సైక్లింగ్‌ను ఎంచుకొని..

ఏథెన్స్ పోటీల తర్వాత సైక్లింగ్ ఎంచుకున్న ఆమె.. అందులోనూ పతకాల వేట కొనసాగించింది. బీజింగ్, లండన్ పోటీల్లో అనేక పతకాలు సాధించింది. టోక్యోలో మూడు విభాగాల్లో పాల్గొన్న సారా.. మూడు స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించింది. తాజాగా పారిస్ పారాలింపిక్స్‌లో మహిళల సైక్లింగ్ ఈవెంట్‌లో రికార్డు సృష్టించింది. 20 నిమిషాల 22.15సెకన్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసుకుంది. ప్రత్యర్థి కంటే నాలుగున్నర సెకన్ల తేడాతో గమ్యాన్ని చేరుకొని మరో బంగారు పతకం కైవసం చేసుకుంది. స్విమ్మింగ్, సైక్లింగ్ విభాగాల్లో మొత్తంగా 29 పతకాలు సాధించిన సారా.. ఆమె క్రీడా జీవితంలో మరో మైలురాయిని చేరుకొంది. పారాలింపిక్స్‌లోనే 18 స్వర్ణాలు సాధించింది. వరల్డ్ ఛాంపియన్‌లో పాల్గొన్న ప్రతిసారీ పతకాలు చేతపట్టుకొని రావడం అలవాటుగా చేసుకొన్న ఆమె.. 46ఏళ్ల వయసులోనూ అలుపెరగని పోరాట పటిమతో ప్రపంచ క్రీడాకారులను ఉత్సాహపరుస్తూనే ఉంది.

# గ్లోబల్ అవార్డు ఇన్ బిజినెస్ ఎక్సలెన్స్ స్థాపన..




ముందడుగు హైదరాబాద్:
గ్లోబెక్స్ అవార్డ్ అనేది కేవలం గుర్తింపునకు సంకేతం కాదు. ఇది విలువైన లక్షణాలను ప్రతిబింబిస్తుంది. కరుణ, పట్టుదల, నిరంతర వృద్ధికి నిబద్ధతగా నిలుస్తుంది. మారిషస్‌లో ఆఫ్రో-ఆసియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పేరుతో ఒక ఛాంబర్‌ను ఏర్పాటు చేసారు. బిజినెస్ మ్యాన్ డా. రామేశ్వర రామధూన్, మరియు భారత దేశం నుండి డా. పి.వి. మజీద్ మరియు డా. వెంకట కె. గంజామ్ కలసి ఈ ఛాంబర్ ను ప్రారంభించారు. గ్లోబెక్స్ అవార్డ్స్ వేడుకలో ఆఫ్రో-ఆసియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ లోగో ను ఆవిష్కరించనున్నారు. భారతదేశానికి సంబంధించిన ఛాంబర్‌ను స్థాపించడం వెనుక వెంకట్ విషన్ మరియు చొరవ వున్నది. వెంకట కే గంజాం సెక్రటరీ జనరల్‌గా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబెక్స్ అవార్డుల కార్యక్రమంలో ఆఫ్రో-ఏషియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.వి.మజీద్, ఏర్పాటును ప్రకటించారు.

# గురువులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాం

## రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉంది ▪ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ముందడుగు తెలంగాణ:
కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలోని మొత్తం 27,862 ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో వరదల సమస్యల వల్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని తెలిపారు. ప్రస్తుత కంపెనీల అవసరాలకు అనుగుణంగా మన విద్యావ్యవస్థ లేదు. మన రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇంకా మారాల్సి ఉంది. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే నైపుణ్య యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నాం. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ పడేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. సమాజాన్ని సన్మార్గంలో పెట్టడంలో గురువులది కీలకపాత్ర. అదృష్టం కొద్దీ మన రాష్ట్రంలో ఆదర్శమైన గురువులు ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాలను మన గురువులు చక్కగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసినప్పుడు




చక్కగా సహకరించారు. గురువులు ఎంత గొప్ప వాళ్లైతే సమాజం కూడా అంత గొప్పగా మారుతుంది అని భట్టి విక్రమార్క అన్నారు.

ముందడుగు
శుక్రవారం, 06-09-2024, హైదరాబాద్

## శ్రీశైలంలో ప్రారంభంకానున్న
# గణపతి నవరాత్రులు

ముందడుగు శ్రీశైలం:



లోక కల్యాణం కోసం వినాయకచవితి పురస్కరించుకుని 07.09.2024 నుండి 16.09.2024 వరకు గణపతి నవరాత్రోత్సవములు నిర్వహించబడనున్నాయి. ఈ ఉత్సవాల సమయంలో ఆలయప్రాంగణంలోని రత్నగర్భగణపతిస్వామి వారికి మరియు శ్రీశైలం సమీపంలోని సాక్షిగణపతిస్వామివారికి మరియు యాగశాలలో వేంచేబు చేయించనున్న గణపతిస్వామివారి పంచలోహమూర్తికి ప్రతీ నిత్యం వ్రతకల్పవిశేషార్చనలు నిర్వహించబడతాయి. అదేవిధంగా శ్రీ సాక్షిగణపతి ఆలయం వద్ద మృత్తికా గణపతిని (మట్టితో చేసిన వినాయకుని విగ్రహాన్ని) కూడా నెలకొల్పి ఉత్సవ సమయంలో ప్రతీరోజు వ్రతకల్పపూర్వకంగా పూజాదికాలను నిర్వహించడం జరుగుతుంది. కాగా 7 తేదీ వినాయకచవితిరోజున ఉదయం గం.8.10ల నుండి ఈ గణపతి నవరాత్రోత్సవాలు ప్రారంభించబడుతాయి.


## శ్రీశైలంలో వరంగల్‌కు చెందిన
# నకిలీ ఆర్ఎస్ఐ అరెస్ట్



ముందడుగు శ్రీశైలం:

శ్రీశైలం మహాక్షేత్రంలో పోలీస్ అధికారిని అంటూ నకిలీ అవతారమెత్తిన వరంగల్ కు చెందిన వ్యక్తిని శ్రీశైలం ఒకటో పట్టణ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ కు చెందిన కుసుమ ప్రశాంత్ ఈనెల ఒకటో తేదీన శ్రీశైలం దర్శనానికి వచ్చారు. తాను సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో ఆర్ఎస్ఐ గా పనిచేస్తున్నట్లు శ్రీశైలం పోలీసులను పరిచయం చేసుకున్నాడు. తనకు వసతి గది, విఐపి దర్శనం ఏర్పాటు చేయాలని కోరాడు. అది నిజమని నమ్మిన శ్రీశైలం పోలీసులు కుసుమ ప్రశాంత్ కు స్వామి అమ్మవార్ల దర్శనం, వసతి ఏర్పాటు చేశారు. అయితే కుసుమ ప్రశాంత్ తీరుపై శ్రీశైలం పోలీసులకు అనుమానం వచ్చింది. శ్రీశైలం ఒకటో పట్టణ సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో కుసుమ ప్రశాంత్ ను నకిలీ ఆర్ఎస్ఐగా గుర్తించారు. నంద్యాల పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితుడు కుసుమ ప్రశాంతపై కేసు నమోదు చేయడంతో పాటు అతని వద్దనున్న నకిలీ పోలీసు గుర్తింపు కార్డు, కారు, నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్కు తరలిస్తున్నట్లు సీఐ ప్రసాద్ రావు తెలిపారు.

# హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్



అడివి శేషు 'హిట్ -2' సినిమా ముగింపులోనే 'హిట్-3' నాని హీరోగా ఉంటుందని చెప్పేశాడు దర్శకుడు శైలేష్ కొలను. తొలి రెండు భాగాలు పెద్ద హిట్లు అవ్వడం, దానికి తోడు మూడో పార్ట్ హీరో నాని కావడంతో ఈ ఫ్రాంచైజీపై విపరీతమైన హైప్ ఏర్పడింది. 'హిట్- 3' అధికారిక ప్రకటన కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'హిట్-3'పై అప్‌డేట్ రానేవచ్చేసింది. గురువారం 'HIT: The 3rd Case' మూవీకి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో భాగంగా నాని పాత్రపై స్నీక్ పీక్ అందిస్తూ ఓ గ్లింప్స్‌ని విడుదల చేశారు. మంచు పర్వతాల మధ్య కారుతో దూసుకుపోతున్న హిట్ ఆఫీసర్‌ని ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ఛేజ్ చేస్తుండగా ఈ గ్లింప్స్ మొదలైంది. హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని సిగార్ తాగుతూ, రక్తపు చేతులతో కారు నడుపుతూ, మరోవైపు గొడ్డలితో ్స్టైలిష్‌గా ఫెరోషియస్‌గా కనిపించారు. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మాత: ప్రశాంతి త్రిపురనేని, నిర్మాణం: వాల్‌పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్.

# పదిహేనేండ్ల సినీ ప్రయాణం

ఈ సెప్టెంబర్ 5 నాటికి నాగచైతన్య తొలి సినిమా 'జోష్' విడుదలై పదిహేనేండ్లు. ఈ దశాబ్దంన్నర ప్రయాణంలో 28 సినిమాల్లో విభిన్నమైన పాత్రలు పోషించారు నాగచైతన్య. ఆయన 29వ చిత్రం 'తండేల్'. అక్కినేని లెగసీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ తాతకు తగ్గ మనవడిగా, తండ్రికి తగ్గ తనయుడిగా నాగచైతన్య సత్తా చాటుతున్నారని, 'తండేల్'లో చైతూ నట విశ్వరూపాన్ని చూస్తారని గురువారం మేకర్స్ తెలియజేస్తూ, నాగచైతన్యకు సంబంధించిన ఓ న్యూ పోస్టర్‌ని విడుదల చేశారు.



సముద్రపు అంచున ఫిషింగ్ బోట్‌పై నిలబడి రగ్గ్‌డ్ అవతార్‌లో చిరునవ్వులు చిందిస్తున్న చైతూ పోస్టర్ అభిమానుల్ని ఆకట్టుకునేలా వుంది. శ్రీకాకుళంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది.
సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఎడిటింగ్: నవీన్ నూలి, నిర్మాత: బన్నీ వాసు, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాణం: గీతా ఆర్ట్స్